ఈనాడు మంచిర్యాల

బుధవారం అక్టోబరు 23, 2024

నీలాకాశాన్ని ముద్దాడేలా ఎర్రనేల!

ప్రకృతిలో సహజంగా ఏర్పడే సహజమైన అందాలు తరచి చూస్తే కనులను ఇట్టే కట్టిపడేస్తాయి. అక్రమంగా తరలించిన మట్టి చాటున ఆహ్లాదకర దృశ్యాలు మంత్రముగ్ధుల్ని చేస్తున్నాయి. బెల్లంపల్లిలోని ఫుడ్ ప్రాసెసింగ్ జోన్ సమీపంలోని ప్రభుత్వ భూమిలో వందల లారీలతో పాటు ట్రాక్టర్లలో అక్రమంగా మట్టి తరలించగా ప్రస్తుతం కట్టగా మిగిలిన మట్టి ఇలా దర్శనమిస్తుంది. రెండు ఎర్రని మట్టి కట్టల నడుమ ఎర్రగా కనిపిస్తున్న నీళ్లు నీలాకాశాన్ని ఎర్రనేల ముద్దాడుతుందా అన్నట్లుగా ఈ చిత్రం కనిపిస్తుంది.

- బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే:



ఫుడ్ ప్రాసెసింగ్ జోన్‌కు సమీపంలో మట్టిని తరలించగా ప్రస్తుతం ఇలా..

రైల్వే ప్రాంగణం.. శునక భయం



మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో వీధికుక్కలు ప్రయాణికులను తీవ్ర ఇబ్బందులు పెడుతున్నాయి. రెండు ప్లాట్‌ఫాంలపై తిరుగుతున్న శునకాలు రాకపోకలకు వస్తున్న వారిని భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. దీంతో పాటు అపరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించడంతో రైల్వేస్టేషన్ ఆవరణ అస్తవ్యస్తంగా తయారవుతోంది. - న్యూస్‌టుడే, మంచిర్యాలఅర్బన్

రుచులు ఆస్వాదించేలా.. లాభాలు ఆర్జించేలా..

● ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ల ద్వారా మహిళలకు ఉపాధి

న్యూస్‌టుడే, చెన్నూరు, నస్పూర్ :



నోరూరించే మిఠాయిలు.. ఘుమఘుమలాడే పిండి వంటకాలు.. సంప్రదాయ రుచులతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో క్యాంటీన్లు ఆహ్వానం పలుకుతున్నాయి. మహిళలకు స్వయం ఉపాధి కల్పించి వారిని ఆర్థికాభివృద్ధి వైపు ప్రోత్సహించేలా ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. నిర్వహణ సామర్థ్యం ఉన్న స్వయం సహాయక సంఘాలను గుర్తించి శిక్షణ ఇచ్చి వీటిని ఏర్పాటు చేస్తున్నారు. రూ.8 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు దశల వారీగా రుణాలు మంజూరు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని నిర్మల్, మంచిర్యాల కలెక్టరేట్ ప్రాంగణాల్లో, లక్షెట్టిపేటలోని ఐకేపీ కార్యాలయం ఆవరణలో ఇప్పటికే స్వయం సహాయ సంఘాల ఆధ్వర్యంలో క్యాంటీన్లు వెలిశాయి.

మంచిర్యాల జిల్లా కలెక్టరేట్‌లో ఆగస్టు 15న ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను స్నేహలత గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో ప్రారంభించారు. చాయ్, అల్పాహారం, నీళ్ల సీసాలు, శీతల పానీయాలు, ఇతర తినుబండారాలు, ఆహార పదార్థాలు నిర్వాహకులు అందుబాటులో ఉంచుతున్నారు. దీంతో నిర్వాహకులు ఉపాధితోపాటు ఇక్కడికి వచ్చే వారికి అందుబాటులో రుచికరమైన నాణ్యమైన ఆహార పదార్థాలు లభిస్తుండటంతో సమయం ఆదా అవుతోంది.

ప్రతిపాదిత ప్రాంతాలివే..

- ఆదిలాబాద్ : కోర్టు ఆవరణ, మున్సిపల్ కార్యాలయం, కలెక్టరేట్
- నిర్మల్ : ఏరియా ఆసుపత్రి, మెడికల్ కాలేజీ, మాతా శిశు ఆసుపత్రి
- ఖానాపూర్ : తహసీల్దారు కార్యాలయం, ఆసుపత్రి ఆవరణ, మున్సిపల్ కార్యాలయం
- మంచిర్యాల : మున్సిపల్ కార్యాలయం, మాతా శిశు ఆసుపత్రి, ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణం, బస్టాండ్
- భైంసా : ఏరియా ఆసుపత్రి, మున్సిపల్ కార్యాలయం
- కుమురంభీం : ఈఎస్ఐ ఆసుపత్రి, మున్సిపల్ కార్యాలయం
- బెల్లంపల్లి : ఏరియా ఆసుపత్రి, మున్సిపల్ కార్యాలయం, ఆర్డీఓ కార్యాలయం



మంచిర్యాల కలెక్టరేట్ కార్యాలయంలో గ్రామైక్య సంఘం సభ్యులు ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్



క్యాంటీన్‌లో అల్పాహారం, భోజనాలు చేస్తున్న వివిధ పనుల నిమిత్తం వచ్చిన వారు, కలెక్టరేట్ కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది

ఉమ్మడి జిల్లాలో 20కి పైగా..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 20కి పైగా మహిళా శక్తి క్యాంటీన్ల ఏర్పాటుకు కార్యాచరణ రూపొందించారు. మంచిర్యాల జిల్లాలోని లక్షెట్టిపేట, నస్పూర్ మినహా మిగతా ఎక్కడా వీటి ఏర్పాటు జరగలేదు.

రద్దీ ప్రాంతాల్లో ఏర్పాటుకు కార్యాచరణ

ప్రభుత్వ కార్యాలయాలు, పారిశ్రామిక, పర్యాటక ప్రాంతాలు, ఆలయాలు, మార్కెట్లు, ఆర్టీసీ బస్టాండ్లు తదితర ప్రాంతాల్లో వీటి ఏర్పాటుకు కార్యాచరణ రూపొందించారు. అందుబాటులో ఉండే ధరలకు నాణ్యమైన ఆహార పదార్థాలు లభిస్తాయి. మహిళా సంఘం సభ్యులతో ఆహార పదార్థాలు, పిండి వంటలు, మిఠాయిలు, పచ్చళ్లు, పండ్ల రసాలు, సంప్రదాయ వంటకాలు తయారు చేయించి విక్రయాలు చేపడుతున్నారు.



అద్దె భారం తప్పింది

- గురిజాల లత, స్వయం సహాయక సభ్యురాలు, హాజీపూర్

నేను మరో ముగ్గురు సభ్యులం కలిసి కలెక్టరేట్‌లో క్యాంటీన్‌ను ఏర్పాటు చేశాం. వీటి ఏర్పాటుకు ఉచితంగా గది ఇవ్వడంతో అద్దె భారం తప్పింది. ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు క్యాంటీన్ నిర్వహిస్తున్నాం. ఉదయం అల్పాహారం, పాలు, కాఫీ, టీలతో పాటు మధ్యాహ్నం భోజనం, సాయంత్రం టీ, కాఫీ ఇతర స్నాక్స్ అందుబాటులో ఉంచాం.

గొడవలకు పాల్పడే బృందాలపై ప్రత్యేక నిఘా

సీపీ శ్రీనివాస్



మాట్లాడుతున్న సీపీ శ్రీనివాస్

మంచిర్యాలనేరవిభాగం, న్యూస్‌టుడే: ప్రజలను భయభ్రాంతులకు గురిచేసినా, చట్ట విరుద్ధ పనులకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపుతామని రామగుండం పోలీసు కమిషనర్ శ్రీనివాస్ హెచ్చరించారు. మంచిర్యాల పోలీస్‌స్టేషన్ ఆవరణలో మంగళవారం జిల్లాలోని రౌడీషీటర్స్‌తో సీపీ సమావేశం నిర్వహించారు. గతంలో చేసిన నేరాల నుంచి మార్పు తీసుకొని సత్ప్రవర్తనతో జీవించాలన్నారు. రౌడీషీటర్లు భవిష్యత్తులో నేరాలలో పాల్గొంటే కఠినమైన చర్యలు తీసుకొని వారిపై పీడీ చట్టం అమలు చేస్తామన్నారు. బృందాలుగా ఏర్పడి గొడవలు, కొట్లాటలు చేసే వారి కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. ఎవరైనా తమ సొంత పనుల కోసం గొడవలు చేయాలని ప్రలోభపెడితే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. కొంతమంది తమ స్నేహితులను కొట్టారని, కొందరి మెప్పు కోసం, డబ్బుల కోసం జులాలు, మత్తుపదార్థాల కోసం అలవాటు పడి నేరాలకు పాల్పడుతున్నారన్నారు. సామాజిక మాధ్యమాలలో రాజకీయ నాయకులు, పార్టీలు, కొన్ని వర్గాలకు చెందిన పోస్టులు చేస్తున్నారని వీరిపై సోషల్ మీడియా ట్రాకింగ్ సెంటర్ ద్వారా నిఘా ఉంటుందన్నారు. గత పది సంవత్సరాలుగా ఎలాంటి నేరం చేయని వారిపై రౌడీషీట్స్ ఎత్తివేస్తామన్నారు. డీసీపీ భాస్కర్, మంచిర్యాల, జైపూర్ ఏసీపీలు ప్రకాష్, వెంకటేశ్వర్లు, ఎస్బీ ఏసీపీ రాఘవేంద్రరావు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.



కౌన్సెలింగ్‌కు హాజరైన రౌడీషీటర్స్

చిరువ్యాపారులకు సీఎస్‌పీ స్థలంలో మార్కెట్

బెల్లంపల్లి పట్టణం: రోడ్లపై విక్రయిస్తున్న చిరువ్యాపారులకు సీఎస్‌పీ సీ(కోల్ స్క్రీనింగ్ ప్లాంటు) స్థలంలో మార్కెట్ ఏర్పాటు చేసే ప్రయత్నాలు చేస్తున్నట్లు పుర ఛైర్‌పర్సన్ జక్కుల శ్వేత తెలిపారు. మంగళవారం ఆమె కమిషనర్ శ్రీనివాసరావుతో కలిసి సింగరేణి పాత సీఎస్‌పీ స్థలాన్ని పరిశీలించారు. రోడ్లపక్కన విక్రయించే చిరువ్యాపారులంతా సీఎస్‌పీ స్థలంలోనే తమ వ్యాపారాలు నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు.

ఉప్పును అయిదు గ్రాములకే పరిమితం చేద్దాం

జిల్లా వైద్యాధికారి హరీష్‌రాజ్



ప్రచారపత్రాలను ఆవిష్కరిస్తున్న వైద్యాధికారులు

మంచిర్యాల వైద్యవిభాగం, న్యూస్‌టుడే: ఉప్పును నియంత్రించి, ఆయా రుగ్మతల నుంచి ఉపశమనం పొందుదామని వైద్యారోగ్యశాఖ జిల్లా అధికారి హరీష్‌రాజ్ అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో సంబంధిత ప్రచార పత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. అయోడిన్‌తో కూడిన ఉప్పునే వాడాలని, రోజుకు అయిదు గ్రాములకు మించి వినియోగించకూడదని పిలుపునిచ్చారు. ఉప్పులో అయోడిన్ లేకపోయినా, అధిక మొత్తంలో వాడినా అనేక అనర్థాలకు దారితీస్తుందని హెచ్చరించారు. వ్యాధులకు దూరంగా ఉండేందుకు ఆరోగ్యకరమైన ఉప్పును వాడాలని కోరారు. దీనిపై జిల్లా వ్యాప్తంగా వైద్యసిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లా ఉపవైద్యాధికారి సుధాకర్‌నాయక్, పీఓలు అనిల్, ఫయాజ్‌ఖాన్, ప్రసాద్, కార్యాలయ పర్యవేక్షణాధికారి విశ్వేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూ యజమానులకు నోటీసులు

లక్షెట్టిపేట, న్యూస్‌టుడే: మండలంలోని లక్షెట్టిపేట, మోదెల, ఇటిక్యాల, పోతపల్లి, సూరారం, గుల్లకోట, మిట్టపల్లి గ్రామాల్లో జాతీయ రహదారి నిర్మాణం కోసం సేకరించిన భూమికి సంబంధించి యజమానులకు రెవెన్యూ శాఖ అధికారులు నోటీసులు అందజేశారు. ఈ నెల 23వ తేదీ లోగా ఆస్తులపై హక్కు పత్రాలు తహసీల్దార్ కార్యాలయంలో అందజేయాలని తహసీల్దార్ దిలీప్ కుమార్ సూచించారు. లేకుంటే అందుబాటులో ఉన్న పత్రాల ఆధారంగా పరిహారం నిర్ణయించనున్నట్లు ఆయన వెల్లడించారు.

అక్రమ రిజిస్ట్రేషన్లకు ప్రణాళిక!

ఒక్కొక్కరి వద్ద రూ. 40 వేలు వసూలు

మంచిర్యాల పట్టణం, న్యూస్‌టుడే:

మంచిర్యాల జిల్లాలో కొంతకాలంగా లేఔట్ అనుమతి లేని స్థలాల రిజిస్ట్రేషన్లు నిలిపివేశారు. అయితే అక్రమంగా వెంచర్లువేసి ప్లాట్లు అమ్మిన స్థిరాస్తి వ్యాపారులు ఎలాగైనా వీటిని రిజిస్ట్రేషన్ చేయించేందుకు ప్రణాళిక రూపొందించారు. జిల్లాలో ఓ కీలక ప్రజాప్రతినిధి అనుచరుడితో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ క్రమంలో రిజిస్ట్రేషన్ శాఖలోని ఓ అధికారి రిజిస్ట్రేషన్లకు ఏర్పాటు చేసుకోవాలని దస్తావేజు లేఖర్లకు చెప్పడంతో వారు 250 దస్తావేజులు సిద్ధం చేసినట్లు సమాచారం.

◆ మంచిర్యాల పట్టణ శివారులోని గ్రామీణ ప్రాంతాల్లో స్థిరాస్తి వ్యాపారులు వ్యవసాయ భూములను లేఔట్ అనుమతి లేకుండానే వెంచర్లుగా మార్చి అమ్మకాలు చేశారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆరు నెలల కిందట పని చేసిన అధికారులు నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా ఒక్కో ప్లాట్ దస్తావేజుకు రూ.30 వేలు తీసుకొని రిజిస్ట్రేషన్లు చేశారు. ఆ విషయం అప్పుడు దినపత్రికల్లో ప్రచురితం కావడంతో రిజిస్ట్రేషన్ల శాఖ ఉన్నతాధికారి మంచిర్యాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో విచారణ నిర్వహించారు. ఆ తర్వాత అక్రమ లేఔట్ ప్లాట్లను రిజిస్ట్రేషన్లు చేయడం నిలిపివేశారు. ప్రస్తుతం లేఔట్ అనుమతి ఉన్న ప్లాట్లకు, లింక్ డాక్యుమెంట్లు, నాలా కన్వర్షన్ ఉన్న ప్లాట్లను నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషన్లు చేసినా అక్రమంగా రూ.10 వేలు మామూలుగా తీసుకుంటున్నారని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

◆ మంచిర్యాల సబ్ రిజిస్ట్రార్ అధికారిగా విధుల్లో చేరిన ప్రియాంక ప్రస్తుతం సెలవులో ఉన్నారు. నవంబరు 2న ఆమె విధుల్లో చేరనున్నారు. ఇక్కడున్న ఇన్‌ఛార్జి అధికారికి మరో 8 రోజులు పనిచేసే అవకాశం ఉండటంతో ఆ సమయంలో మొత్తం 900 అక్రమ లేఔట్ ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయించడానికి ఓ ప్రజాప్రతినిధి అనుచరుడు పథకం రూపొందించినట్లు తెలిసింది. ఇందులో 250 దస్తావేజులు సిద్ధం చేసినట్లు తెలిసింది. ఒక్కోదానికి రూ.40 వేలు తీసుకుని, అందులో సగం కీలక నేతలకు, మిగతా సగం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది నుంచి ఉన్నతాధికారుల వరకు ముడుపులు ఇవ్వడానికి నిర్ణయించినట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.



మంచిర్యాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

ఈ విషయం వెలుగులోకి రావడంతో తాత్కాలికంగా ఈ తతంగం పెండింగ్‌లో పెట్టినట్లు తెలిసింది.

అనుమతి ఉన్న ప్లాట్లకే రిజిస్ట్రేషన్లు

శ్రీనివాస్‌రెడ్డి, ఇన్‌ఛార్జి సబ్ రిజిస్ట్రార్, మంచిర్యాల

మంచిర్యాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నిబంధనల ప్రకారమే లేఔట్ అనుమతి ఉన్న ప్లాట్లనే రిజిస్ట్రేషన్లు చేస్తున్నాం. లేఔట్ అనుమతి లేని ప్లాట్లకు చేయం.

చేతికందుతున్న ధాన్యం.. కొనుగోళ్లు లేక దైన్యం

కేంద్రాల ఏర్పాటులో జాప్యం

మంచిర్యాల గ్రామీణం, న్యూస్‌టుడే:

వానాకాలం సీజన్ ముగింపు దశకు చేరి రైతుల చేతికి ధాన్యం అందుతోంది. కానీ జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో జాప్యమవుతోంది. రైతులు పలు ప్రాంతాల్లో ధాన్యాన్ని రైస్‌మిల్లుల్లోనే విక్రయిస్తున్నారు. జిల్లాలోని మంచిర్యాల, చెన్నూరు, బెల్లంపల్లి నియోజకవర్గాల్లో ఇప్పటికే పలు మండలాల్లో వరి కోతలు ప్రారంభమవగా కేంద్రాల ఏర్పాటు ఇంతవరకు ప్రారంభం కాలేదు.

సన్నరకంపై ఆందోళన..

రైతులు పండించే ధాన్యానికి ప్రభుత్వం కనీస మద్దతు ధర అందిస్తుంది. రైతులు దళారీల జోలికి పోకుండా ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయిస్తే ఎంతో ఉపయోగంగా ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు. జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన వసతులు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరిస్తున్నారు. కానీ ఇంతవరకు కేంద్రాల ఏర్పాటు ఊసే లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలో సన్నరకం ధాన్యం సేకరణలోనూ అనేక అనుమానాలను రైతులు వ్యక్తం చేస్తున్నారు. గ్రేడ్-ఏ ధాన్యానికి కనీస మద్దతు ధరను రూ.2,320 కాగా కామన్ రకం ధాన్యానికి రూ.2,300 చెల్లిస్తున్నారు. సన్నరకానికి అదనంగా రూ.500 బోనస్‌గా చెల్లించనున్నారు. వీటిలో 33 రకాలు ఉన్నందున ఎంపికపై ఆందోళన నెలకొంది. ప్రభుత్వం సూచించిన కొలతలు, నాణ్యత ఆధారంగా సన్నరకం ధాన్యాన్ని గుర్తించి బోనస్ చెల్లించడంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశముందని కర్షకులు భావిస్తున్నారు. నిత్యం ఏదో ప్రాంతంలో వర్షాలు కురుస్తుండడంతో వరి కోసి కొనుగోలు కేంద్రాల కోసం ఎదురుచూడకుండా సమీపంలోని రైస్‌మిల్లుల్లో ధాన్యాన్ని విక్రయిస్తున్నామని పలువురు రైతులు పేర్కొన్నారు.



కోతకు సిద్ధమైన వరి

జిల్లాలోని మండలాలు : 18	పురపాలికలు : 07	ఐకేపీ కేంద్రాలు : 148	మెప్మా కేంద్రాలు : 06	సన్నరకం : 2.16 మె.ట.
	పంచాయతీలు : 311	పీఏసీఎస్ కేంద్రాలు : 70	డీసీఎంఎస్ కేంద్రాలు : 35	దొడ్డురకం : 1.13 మె.ట.
జిల్లాలో ఏర్పాటుచేయనున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలివే..	ప్రారంభమైన కొనుగోలు కేంద్రాలు : 01 (చిత్తాపూర్, బెల్లంపల్లి నియోజకవర్గం)	ప్రతిపాదిత గన్నీ సంచులు : 82 లక్షలు	అందుబాటులోని గన్నీ సంచులు : 21 లక్షలు	ధాన్యం దిగుబడి అంచనా : 3.29 (మె.ట (మెట్రిక్ టన్నులు రూ.లక్షల్లో)

కేంద్రాల ఏర్పాటుకు చర్యలు

కిషన్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి, మంచిర్యాల.

జిల్లాలో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సత్వరమే ఏర్పాటుచేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే క్షేత్రస్థాయిలో సిబ్బందితో వసతుల కల్పన, ఏర్పాట్లు పూర్తిచేశాం.

వార్డులు తిరిగి.. రోగులతో మాట్లాడి

బెల్లంపల్లిలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని మంగళవారం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో మందుల నిల్వలతో పాటు రికార్డులను పరిశీలించారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఆసుపత్రిలోని వార్డులకు వెళ్లి రోగులతో మాట్లాడారు. వైద్య సదుపాయాలపై ఆరా తీశారు. మందులు అన్ని వేళల్లో అందుబాటులో ఉండేలా చూసుకోవాలని వైద్యాధికారి డాక్టర్ రవికుమార్‌ను ఆదేశించారు. ఆసుపత్రిలోని డయాలసిస్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. అంతకుముందు జిల్లా పరిషత్ బాలికల పాఠశాలను తనిఖీ చేసి ఆవరణను పరిశీలించారు. వార్షిక పరీక్షల్లో ఉత్తమమైన ఫలితాలు సాధించేలా ఇప్పటినుంచే విద్యార్థులను సన్నద్ధం చేయాలని ఆదేశించారు. - బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే:



ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగులతో మాట్లాడుతున్న జిల్లా పాలనాధికారి కుమార్ దీపక్

భూ సేకరణ ప్రక్రియ వేగవంతం

ఏసీసీ, న్యూస్‌టుడే: జాతీయ రహదారుల నిర్మాణంలో భాగంగా భూసేకరణ ప్రక్రియను పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం రాష్ట్ర రోడ్డు, భవనాలు, రవాణా శాఖ కార్యదర్శి దాసరి హరిచందన జిల్లా యంత్రాంగంతో నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. 163జి జాతీయ రహదారి నిర్మాణానికి జిల్లా పరిధిలో 110 హెక్టార్ల భూమి సేకరించాల్సి ఉండగా 83 హెక్టార్‌లు పూర్తయిందని చెప్పారు. నవంబరు 10 లోగా మిలిగిన భూములు సేకరించి అందిస్తామన్నారు. కోర్టు సంబంధిత కేసులు పూర్తిచేసి సంబంధిత నివేదికలు అందించనున్నట్లు తెలిపారు. అనంతరం జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించి జాతీయ రహదారుల నిర్మాణంలో భూసేకరణ అంశంపై కలెక్టర్ చర్చించారు. సేకరణలో భాగంగా కోల్పోయే బోర్‌వెల్స్, ప్రభుత్వ భవనాలు, పంట సాగు, పైప్‌లైన్లు, ఇతర నిర్మాణాలపై పూర్తి వివరాలతో నివేదిక అందించాలని ఆదేశించారు. ఆర్డీవో వి.రాములు, రోడ్డు భవనాలు, మద్యపాన నిషేధ, అటవీ, ఉద్యానవన, మిషన్ భగీరథ, గ్రామీణ నీటి పారుదల శాఖ అధికారులు పాల్గొన్నారు.

‘మంచి మంచిర్యాల’ తొలగింపుపై వివాదం

మంచిర్యాల పట్టణం, న్యూస్‌టుడే:

మంచిర్యాల జిల్లా కేంద్రంలో ‘మంచి మంచిర్యాల’ సెల్ఫీ పాయింట్ తొలగింపు వివాదాస్పదమైంది. రెండేళ్ల కిందట జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో పట్టణ ప్రగతి నిధులు రూ.20 లక్షలతో ‘మంచి మంచిర్యాల సెల్ఫీ పాయింట్’ ఏర్పాటు చేశారు. ఈ నెల 20న రాత్రి దీన్ని తొలగించారు. ఈ విషయంపై మున్సిపల్ అధికారులను వివరణ కోరగా తమకు తెలియదని సమాధానం ఇచ్చారు. సెల్ఫీ పాయింట్ తొలగించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, భారాస నాయకులు ధర్నా చేశారు.



మంచిర్యాలలో మున్సిపల్ నీటి ట్యాంకు వద్ద మంగళవారం పెట్టిన సెల్ఫీ పాయింట్ అక్షరాలు

ఛైర్మన్, అధికారుల పొంతన లేని సమాధానాలు

సెల్ఫీ పాయింట్ తొలగింపు తమకు తెలియదని మున్సిపల్ కమిషనర్ మారుతీ ప్రసాద్, మున్సిపల్ ఇంజినీర్లు మసూద్ అలీ, రాజేందర్, పట్టణ ప్రణాళిక అధికారులు సంపత్, శ్యాంసుందర్, పారిశుద్ధ్య విభాగం అధికారి ఉదయ్ కిరణ్ పేర్కొన్నారు. తొలగింపుపై భారాస నాయకులు ధర్నా చేయడంతో మున్సిపల్ ఛైర్మన్ రావుల ఉప్పలయ్య కాంగ్రెస్ నాయకులతో విలేకరుల సమావేశం నిర్వహించారు. అక్కడ కూల్చివేత పనులు జరుగుతున్నందున మంచి మంచిర్యాల సెల్ఫీ పాయింట్ అక్షరాలపై రాళ్లు, దుమ్ము పడి ధ్వంసం అవుతాయనే ఉద్దేశంతో ఈ నెల 20వ తేదీ సాయంత్రం మున్సిపల్ సిబ్బందితో తొలగించి కార్యాలయంలో పెట్టించామని ప్రకటించారు. మున్సిపల్ సహాయ ఇంజనీరు రాజేందర్ మాత్రం సెల్ఫీ పాయింట్ అక్షరాలు మంగళవారం ఆర్‌అండ్‌బీ కార్యాలయం ఆవరణలో పడి ఉన్న విషయం గుర్తించి వాటిని మున్సిపల్ నీటి ట్యాంకు వద్ద పెట్టామని తెలిపారు. ఈ క్రమంలో మంగళవారం మున్సిపల్ కమిషనర్ మారుతీ ప్రసాద్ కార్యాలయానికి రాలేదు. ఫోన్ చేసినా స్పందించడం లేదు. రాజకీయ వివాదాల నేపథ్యంలో కమిషనర్ ఇక్కడి నుంచి బదిలీకి లేదా దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడానికి సిద్ధమైనట్లు తెలిసింది.



మంచిర్యాలలో సెల్ఫీ పాయింట్ గద్దె వద్ద ధర్నా చేస్తున్న మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, భారాస నాయకులు

పేదలపై అభిమానం.. సేవే పరమార్థం



● పల్లెబాట పట్టిన సివిల్ సర్వీస్ శిక్షణ అధికారులు



సివిల్ సర్వీస్ శిక్షణ అధికారుల బృందం క్షేత్రస్థాయి శిక్షణలో భాగంగా పల్లెబాట పట్టింది. ఆదిలాబాద్ గ్రామీణ మండలం లోకారి, ఖండాల, తదితర గ్రామాల్లో పర్యటించింది. క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటిస్తున్న అధికారులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు తీరును పరిశీలిస్తున్నారు. ఆదివాసీల స్థితిగతులు, తాగునీరు, రహదారులు, విద్యుత్తు సౌకర్యాలు, పాడిపంటలు, రవాణా సౌకర్యం, వ్యవసాయ పద్ధతులు అడిగి తెలుసుకున్నారు. క్షేత్ర స్థాయిలో సమస్యలను తెలుసుకుంటూ గ్రామాభివృద్ధికి సలహాలు, సూచనలు అందిస్తున్నారు. గుర్తించిన సమస్యలను ప్రభుత్వానికి నివేదిక రూపంలో అందిస్తామన్నారు. ఈ పర్యటన ఎంతో ఉపయోగపడుతున్నట్లు ఆనందం వ్యక్తం చేశారు. జాతీయ స్థాయి ప్రతిష్ఠాత్మక సివిల్ సర్వీస్‌లో ఉన్న శిక్షణ అధికారులు ప్రజా సేవే లక్ష్యమని, పేదలంటే అభిమానమని, వారికి సేవ చేయడం ఆనందంగా భావిస్తున్నట్లు 'ఈనాడు'తో వారి మనోగతాన్ని పంచుకున్నారు. ప్రణాళికాబద్ధంగా, పట్టుదలతో చదివితే లక్ష్యానికి పేదరికం అడ్డురాదని నేటి యువతకు దిశానిర్దేశం చేశారు.

-న్యూస్‌టుడే, ఆదిలాబాద్ గ్రామీణం



ఆదిలాబాద్ మండల అధికారులతో సివిల్ సర్వీస్ శిక్షణ అధికారులు

నాన్న కష్టమే ఐపీఎస్‌ను చేసింది



నేను రైతు బిడ్డను. నాన్న వ్యవసాయంలో ఆరుగాలం పడే కష్టం ముందు నా లక్ష్యం అసాధ్యం కాదనిపించింది. ప్రాథమిక విద్య, ఇంటర్ ప్రైవేటులో.. డిగ్రీ బీఎస్సీ కంప్యూటర్ ప్రభుత్వ కళాశాలలో పూర్తి చేశా. ఎలాంటి శిక్షణ లేకుండా ఇంటి వద్దనే సొంత ప్రిపరేషన్‌తో రోజూ 8 గంటలు చదివేవాడిని. ఎలాంటి శిక్షణ లేకుండానే మొదటి ప్రయత్నంలో సివిల్స్‌లో ఐపీఎస్‌కు ఎంపికయ్యాను. నిబద్ధత, పట్టుదల, ఇష్టంతో చదివితే సాధ్యం కానిది ఏది లేదు.

- రాంనీక్ గౌతమ్, ఐపీఎస్ శిక్షణ అధికారి, ఉత్తరప్రదేశ్

ఓడిపోతే కుంగిపోవద్దు..



పట్టుదలతో ప్రణాళికాబద్ధంగా ఒకటి కాదు.. రెండు కాదు. . మూడేళ్లు కష్టపడి చదివాను. లక్ష్య సాధనలో ఎన్నో ఆటుపోట్లు వచ్చినా లక్ష్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాను. అనుకున్నది సాధించి ఐఎస్ఎస్‌కు ఎంపికయ్యాను. నాన్న చతుర్భాజ్ గుప్తా వ్యాపారం చూసుకుంటారు. అమ్మ కామిని గుప్తా గృహిణి. వారి ప్రోత్సాహంతోనే విజయం సాధించాను. ఒక్కసారి ఓడిపోగానే వదిలేయొద్దు.

- ప్రకర్ గుప్తా, ఐఎస్ఎస్, ఉత్తరప్రదేశ్

దిల్లీకి వెళ్లాల్సిన అవసరం లేదు

- కౌషల్ కిశోర్, ఐఎఫ్ఎస్, బిహార్



సివిల్స్ సన్నద్ధతలో ఆన్‌లైన్ విద్యకు ప్రాధాన్యమిచ్చా. బీటెక్ ఐఐటీ దిల్లీలో పూర్తి చేశా. ఐఐటీ జేఈఈలో టెక్నాలజీ కన్సల్టెంట్‌గా పని చేశా. ఉద్యోగం చేస్తూనే ఆన్‌లైన్‌లోనే శిక్షణ తీసుకున్నాను. సివిల్స్‌లో శిక్షణ కోసం దిల్లీకి వెళ్లాల్సిన అవసరం లేదు. ఒకవేళ శిక్షణ కావాలనుకున్నవారు హైదరాబాద్‌లో తీసుకుంటే సరిపోతుంది. ప్రణాళిక, సరైన మార్గాన్ని ఎంచుకుంటే అనుకున్నది సాధించడానికి అవకాశం ఉంటుంది.

పోలీసులపై నమ్మకం కలిగిస్తా



వ్యక్తిగత నైపుణ్యం, పట్టుదల ఉంటే సివిల్స్ విజయం సాధించవచ్చు. యూట్యూబ్, గూగుల్ మాధ్యమాల ద్వారా మనకు అవసరమైన సమాచారం సులువుగా పొందవచ్చు. చదువుపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ఇంకా ఎలాంటి ఆలోచనలకు అవకాశం ఇవ్వొద్దు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే లక్ష్యాన్ని చేరుకున్నాను. ప్రజాసేవే లక్ష్యంగా పని చేస్తాను. పోలీసులపై మరింత నమ్మకం కలిగిస్తాను.

- రోషన్, ఐపీఎస్ శిక్షణ అధికారి, రాజస్థాన్

వార్తా పత్రికలు రోజూ చదవాలి

- ప్రసాద్ కృష్ణన్, ఐఆర్ఎస్, కేరళ



మాది కేరళలోని త్రివేండ్రం. నాన్న నందాకుమారన్ ప్రైవేట్ ఉద్యోగి. అమ్మ ప్రైవేట్ ఉపాధ్యాయురాలు. సివిల్స్ సన్నద్ధతలో భాగంగా వార్తా పత్రికలు రోజూ చదవాలి. అవి మన జనరల్ నాలెడ్జిని, విశ్లేషించే సామర్థ్యాన్ని పెంపొందిస్తాయి. శిక్షణలో ముఖ్యంగా సాధన ఎక్కువగా ఉండాలి. ప్రతి అంశంపై పట్టు సాధించాలి. అమ్మానాన్నల కష్టాలను చూసి అనుకున్న లక్ష్యం వైపు వెనుకడుగు వేయకుండా ప్రయత్నించా. చెన్నైలో ఐఆర్ఎస్ కస్టమ్స్, పరోక్ష పన్నులో పోస్టు ఇచ్చారు. పేదలకు సేవ చేయడం వరంగా భావిస్తున్నాను.

ప్రతికూలతలు దాటి.. విజేతగా నిలిచి!

● పెళ్లి.. పిల్లలు కొలువుకు ఆటంకం కాదని నిరూపించిన సుమలత



న్యూస్‌టుడే, ఉట్నూరు : పేద కుటుంబంలో జన్మించి ప్రతికూల పరిస్థితుల మధ్య చదివింది ఆమె.. చిన్న వయసులోనే పెద్దలు పెళ్లి చేశారు. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే లక్ష్యం ముందు అవన్నీ కరిగిపోయాయి. గృహిణిగా ఉంటూనే.. భర్త ప్రోత్సాహంతో ఉన్నత విద్యను పూర్తి చేసి రాత్రింబవళ్లు కష్టపడి విజయం సాధించారు. ఇటీవల విడుదలైన ఉద్యోగాల ఫలితాలలో ఎస్జీటీగా కొలువు సాధించి ఇతరులకు స్ఫూర్తిగా నిలిచారు.

నిర్మల్ జిల్లా కడెం మండలానికి చెందిన రాపెల్లి రాయలింగు, సత్తవ్వ దంపతులది నిరుపేద వ్యవసాయ కుటుంబం. వీరికి రవీందర్, వెంకటేష్, సుమలత ముగ్గురు సంతానం. సుమలత స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చదివారు. పదో తరగతిలో 526 మార్కులు సాధించి స్థానికుల మన్ననలు అందుకున్నారు. తల్లిదండ్రులు అప్పులు చేసి మంచిర్యాలకు పంపించి ఇంటర్ చదివించారు. ఆ తరువాత ఆమె టీటీసీ ప్రవేశ పరీక్ష రాసి ర్యాంకు పొందడంతో ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ డైట్ కళాశాలలో టీటీసీ సీటు సాధించారు. కుటుంబ పరిస్థితుల కారణంగా తల్లిదండ్రులు ఆమె టీటీసీ చేస్తుండగానే కొండా సత్యం అనే యువకుడికి ఇచ్చి వివాహం చేశారు.

భర్త ప్రోత్సాహంతో..

టీటీసీ చేస్తుండగానే పెళ్లి చేసినా.. లక్ష్యాన్ని మాత్రం వీడలేదు. ఆమెకు హిమన్ష్, మేధాన్ష్ అనే ఇద్దరు పిల్లలు జన్మించారు. ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగం సాధించాలనేది తన ఆశయమని భర్త సత్యంతో మనసులోని మాటను పంచుకున్నారు. భర్త ఆమెను ప్రోత్సహించడంతో టీటీసీ పూర్తి చేయడంతోపాటు డిగ్రీ చదివారు. బీఈడీ ప్రవేశ పరీక్ష రాసి ర్యాంకు సాధించి బీఎడ్ చేశారు. పీజీలో ఎమ్మెస్సీ మ్యాథ్స్ చేశారు. ఉద్యోగాల కోసం కసితో సాధన చేశారు. డీఎస్సీ రాశారు. మంచి ర్యాంకు సాధించి ఎస్జీటీగా ఉద్యోగం పొందారు. పెళ్లయిన పదేళ్ల తరువాత తన కలను నెరవేర్చుకున్నారు. తాజాగా దస్తూరాబాద్ మండలం గొడిసిర్యాలలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో టీచరుగా తొలి పోస్టింగ్ పొందారు. పెళ్లి.. పిల్లలు.. కుటుంబ బాధ్యతలు ఇవేవి విజయానికి అడ్డుకాదని నిరూపించారు.

సమీకృత వ్యవసాయం, సాంకేతిక విధానంపై అవగాహన



విద్యార్థులకు డ్రోన్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

రామకృష్ణాపూర్, న్యూస్‌టుడే: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం జగిత్యాల, సిరిసిల్ల కళాశాలలకు చెందిన కృషి అనుభవ విద్యార్థులకు సమీకృత వ్యవసాయ విధానం, డ్రోన్ సాంకేతిక విధానంపై మంగళవారం మండల వ్యవసాయ అధికారి కిరణ్మయి అవగాహన కల్పించారు. మందమర్రి మండలంలోని బొక్కలగుట్ట గ్రామంలోని సమీకృత వ్యవసాయ క్షేత్రంలో సమీకృత వ్యవసాయ విధానంపై అవగాహన కల్పించారు. సమీకృత వ్యవసాయ విధానంలో వ్యవసాయంతో పాటు వ్యవసాయ అనుబంధ రంగాలైన పాడి, చేపలు, కోళ్లు, తేనెటీగల పెంపకం, చిన్నతరహా పరిశ్రమలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ విధానంతో రైతుకు ఎక్కువ నికర ఆదాయంతో పాటు నష్ట భయం తగ్గుతుందని తెలిపారు. సారంగపల్లి గ్రామంలోని ఓ పొలంలో డ్రోన్ పరికరం ద్వారా పురుగు మందుల పిచికారీపై ప్రదర్శనాత్మక అవగాహన కల్పించారు. ఈ విధానం ద్వారా పది లీటర్ల నీటిని ఉపయోగించి ఆరు నిమిషాల్లో ఒక ఎకరా విస్తీర్ణంలో పురుగు మందులు పిచికారి చేసుకోవచ్చని తెలిపారు. ఏఈఓలు ముత్యం తిరుపతి, కనకరాజు, విద్యార్థులు తిరుపతి, శ్రీధర్, నవితేజ, శ్రీచరణ్, విపిన్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యులు లేక.. పర్యవేక్షకులకు పరీక్ష

మంచిర్యాలలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి పరిస్థితి అస్తవ్యస్తంగా మారుతోంది. జనరల్ మెడిసిన్‌లో వైద్యులు సక్రమంగా రావడం లేదు. పిల్లల విభాగం పరిస్థితి ఆగమ్యగోచరంగా తయారైంది. ఇప్పుడు ఈఎన్‌టీ(చెవి, ముక్కు, గొంతు వైద్య నిపుణులు) వంతు వచ్చింది. ఉన్న ఇద్దరు సెలవులో ఉండటంతో తప్పని పరిస్థితుల్లో ఆయా విభాగం ప్రొఫెసర్, జీజీహెచ్ పర్యవేక్షణాధికారి ఓపీ గదిలో ఉండాల్సి వస్తోంది.

- న్యూస్‌టుడే, మంచిర్యాల సిటీ



ఈఎన్‌టీ ఓపీ విభాగంలో మంగళవారం పరీక్షలు నిర్వహిస్తున్న పర్యవేక్షణాధికారి డా.హరిశ్చంద్రారెడ్డి

పక్షం రోజులే గడువు!

● ఎమ్మెల్సీ ఓటరు నమోదులో టీచర్లు, పట్టభద్రుల నిర్లిప్తత



పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే:

పట్టభద్రుల, ఉపాధ్యాయ మండలి ఎన్నికల సందడి మొదలైంది. ఇందుకు కీలమైన ఓటరు నమోదు ప్రక్రియ మాత్రం మందకొడిగా సాగుతోంది. ఓటు నమోదు దరఖాస్తుల స్వీకరణకు నవంబరు ఆరో తేదీ తుది గడువు. అంటే మరో పక్షం రోజుల గడువు మాత్రమే మిగిలి ఉంది.

జిల్లాలవారీగా ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులు



జిల్లా	ఉపాధ్యాయులు	పట్టభద్రులు
కుమురంభీం	12	1,049
మంచిర్యాల	61	7,742
ఆదిలాబాద్	37	3,063
నిర్మల్	55	4,838

● జిల్లా ● ఉపాధ్యాయులు ● పట్టభద్రులు


బోధకుల నిరాసక్తత



సాధారణంగా ఉపాధ్యాయ, అధ్యాపక వృత్తిలో కొనసాగే వారిని మేధావివర్గంగా భావిస్తుంటాం. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటు నమోదు విషయంలో మాత్రం ఆ వర్గం దూరంగా ఉంటోంది. పలు సంఘాలు పాఠశాలలకు వెళ్లి స్వచ్ఛందంగా నమోదు పత్రాలు ఇవ్వాల్సిన పరిస్థితి నెలకొంది. ఉమ్మడి జిల్లాలో దాదాపు 30 వేల మంది టీచర్లు, అధ్యాపకులు ఉండగా ఇప్పటి వరకు 165 మంది మాత్రమే ఎమ్మెల్సీ ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకున్నారు.

ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్ ఉమ్మడి జిల్లాల పరిధిలోని కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, జగిత్యాల, పెద్దపల్లి, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, హనుమకొండ, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల పట్టభద్రులు, టీచర్లు ఓటర్లుగా ఉంటారు. మండలి ఎన్నికల్లో ఓటు వేయాలంటే కొత్తగా అర్హులంతా దరఖాస్తు చేసుకోవాల్సిందే. కిందటి ఎన్నికల ఓటరు జాబితాలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో టీచర్లు 4,599 మంది, పట్టభద్రులు 38,908 మంది ఓటర్లుగా నమోదు చేసుకున్నారు. ప్రస్తుతం ఇప్పటి వరకు టీచర్లు 165 మంది దరఖాస్తు చేసుకుంటే పట్టభద్రుల ఓటు కోసం 16,692 మంది దరఖాస్తు చేసుకోవడం గమనార్హం.

కేంద్రాలు వెలవెల..



అన్ని తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాల్లో టీచరు, పట్టభద్రుల ఓటరు నమోదు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రత్యేక అధికారిని నియమించి దరఖాస్తులను అందుబాటులో ఉంచినా ఆ కేంద్రాలకు వచ్చేవారే కరవయ్యారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఉన్నా ఓటర్ల నుంచి స్పందన అంతంతమాత్రంగానే ఉంటోందని అధికారవర్గాల మాట.

ఎవరు అర్హులు..

పట్టభద్రులు ఓటు నమోదు(ఫాం-18) చేసుకోవాలంటే 2021 అక్టోబరు 31 నాటికి డిగ్రీ పూర్తయి ఉండాలి. టీచర్లు/అధ్యాపకులైతే 2018 నవంబరు ఒకటి నుంచి 2024 అక్టోబరు 31 వరకు మూడు సంవత్సరాలకు తగ్గకుండా ఉన్నత పాఠశాల, కళాశాల స్థాయి విద్యాసంస్థల్లో పనిచేసి ఉంటే వారు ఫారం-19 పూరించి ఓటు నమోదు చేసుకోవచ్చు.

ఆన్‌లైన్‌లో నమోదు ఇలా

ఇంటి వద్ద నుంచి ఓటు నమోదు చేసుకోవాలనుకునే వారు www.ceotelangna.nic.in వెబ్‌సైటును సంప్రదించి పట్టభద్రులైతే ఫారం-18, టీచర్లయితే ఫారం-19 దరఖాస్తును పూరించి గెజిటెడ్ అధికారి ధ్రువీకరించిన డిగ్రీ సర్టిఫికెటు, ఆధార్, ఓటరు ఐడీ పత్రాలతోపాటు ఫొటోను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసుకోవచ్చు.



జగదాంబ ఆలయంలో కొనసాగుతున్న విద్యార్థుల చదువులు

గుడిలో సాగుతున్న బడి

ఈటీవీ - ఆదిలాబాద్, న్యూస్‌టుడే - బేల :

అక్షరాలు నేర్చుకోవాలంటే బడికి వెళ్లాలి. పూజా కార్యక్రమాలకు గుడికి వెళ్లాలి. ఇది అందరికి తెలిసిందే. బేల మండలం పిట్‌గావ్(ఎల్) చిన్నారులు చదువుకోవటానికి బడికి కాకుండా గుడికి వెళ్తున్నారు. ఇక్కడ అంతా గిరిజనులే. ఒకటి నుంచి అయిదో తరగతి వరకు మొత్తం 36 మంది విద్యార్థులు ఉన్నారు. పాత బడి శిథిలావస్థకు చేరడంతో ప్రభుత్వం ఏడాది కిందట రూ.21 లక్షలు కేటాయించింది. విద్యాశాఖాధికారులు, ఇంజినీర్ల పర్యవేక్షణ కరవై గుత్తేదారు పిల్లర్లు వేసి భవన నిర్మాణాన్ని మధ్యలోనే వదిలేశాడు. స్థానికులంతా కలిసి ఆరునెలల కిందటి వరకు గ్రామంలోని హనుమాన్ ఆలయంలో, తాజాగా ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న జగదాంబ దేవి ఆలయంలో చదువులను కొనసాగిస్తున్నారు. తాజాగా నియామకాల్లో కొత్తగా ఉద్యోగంలో చేరిన ఉపాధ్యాయుడు హరికృష్ణ ఆ గుడిలోనే పిల్లలకు బోధిస్తున్నారు.

☛ ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా పట్టించుకోలేదని.. పిల్లల చదువులకు ఆటంకం ఏర్పడకూడదనే ఆలోచనతో గుడిలో ఏర్పాటుచేసిన బడికి పంపిస్తున్నామని గ్రామస్థులు జాదవ్ విలాస్, పవార్ గోపీ ఆవేదన వ్యక్తం చేశారు.

☛ జిల్లా విద్యాశాఖాధికారి ప్రణీతను 'ఈనాడు' సంప్రదించే ప్రయత్నం చేయగా స్పందించలేదు.



పిట్‌గావ్(ఎల్)లో ఆగిపోయిన పాఠశాల కొత్త భవన నిర్మాణ పనులు

అయిదుగురు ఏఈఓల సస్పెన్షన్

లక్షెట్టిపేట, న్యూస్‌టుడే: రైతు బీమా విషయంలో నిర్లక్ష్యం వహించినందుకు మంచిర్యాల జిల్లాలోని అయిదుగురు వ్యవసాయ విస్తరణాధికారుల(ఏఈఓ-గ్రేడ్)ను సస్పెండ్ చేస్తూ రాష్ట్ర వ్యవసాయ సంచాలకులు ఉత్తర్వులు జారీ చేశారు. లక్షెట్టిపేట, జైపూర్, బెల్లంపల్లి, నస్పూర్, చెన్నూరు మండలాలకు చెందిన ఒక్కో ఏఈఓను సస్పెండ్ చేశారు. జిల్లా వ్యవసాయ అధికారి కల్పనను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా జిల్లాలోని అయిదుగురు ఏఈఓలను సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయని తెలిపారు.

ఉపకార వేతనం.. భవితకు ఊతం





దండేపల్లి, న్యూస్‌టుడే: చదువుకోవాలనే తపన ఉన్నా ఆర్థిక స్థోమత లేక ఎంతో మంది విద్యార్థులు తమ చదువులను అర్ధంతరంగా ఆపేసిన సంఘటనలు ఉన్నాయి. ఈ తరుణంలో ప్రతిభ ఉన్న విద్యార్థులకు ప్రభుత్వం ఊతం అందిస్తోంది. వీటిని అందిపుచ్చుకుని ఉన్నత విద్యను అభ్యసిస్తూ ముందుకు సాగుతున్నారు. పరీక్షలో ప్రతిభ కనబరిచే విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం జాతీయ ఉపకార వేతనాలు (ఎన్ఎంఎంఎస్) అందిస్తోంది. నాలుగేళ్ల పాటు ఉపకారం అందుకుంటూ ఉన్నత చదువులు చదివే అవకాశముంది. ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు జాతీయ స్థాయిలో పరీక్ష ఉంటుంది. ఇందులో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఏటా రూ. 12 వేల చొప్పున తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ పూర్తయ్యే వరకు నాలుగేళ్ల పాటు ఉపకారవేతనం అందిస్తారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు అర్హులు. వచ్చే నెల 24న అన్ని జిల్లా కేంద్రాల్లో పరీక్ష నిర్వహించనున్నారు.

ఇందులో మొత్తం 180 మార్కులు ఉండగా పరీక్షలో రెండు విభాగాలు ఉంటాయి.

☛ మొదటిది (పార్ట్ 1): మానసిక సామర్థ్య పరీక్ష 90 ప్రశ్నలకు 90 మార్కులుంటాయి. ఇందులో రీజనింగ్ ఎబిలిటీస్, సంఖ్యా శాస్త్రం, పదాల భిన్న పరీక్ష, నంబర్ అనాలజీ, ఆల్ఫాబెట్ అనాలజీ, కోడింగ్-డీకోడింగ్, లాజికల్ ప్రశ్నలు, వెన్‌చిత్రాలు, మిర్రర్ ఇమేజెస్, వాటర్ ఇమేజెస్ తదితర అంశాలలో ప్రశ్నలు ఉంటాయి. వీటిని సాధన చేయాలి.

☛ రెండో విభాగంలో ఏడు, ఎనిమిదో తరగతి సిలబస్ నుంచి 90 ప్రశ్నలు, 90 మార్కులుంటాయి. గణితం 20 మార్కులు, భౌతిక, రసాయన, జీవ శాస్త్రం కలిపి 35 మార్కులు, సాంఘిక శాస్త్రంలో 35 మార్కులు. పరీక్ష ఆంగ్ల, తెలుగు మాధ్యమాల్లో బహుళైచ్ఛిక (మల్టిపుల్ ఛాయిస్) రూపంలో ఉంటాయి. పరీక్షకు కేవలం నెల రోజులు మాత్రమే ఉండటంతో ప్రణాళికాబద్ధంగా సాధన చేస్తే విజయం దక్కుతుంది. ఉమ్మడి జిల్లా నుంచి 240 మంది వరకు ఎన్నికయ్యే అవకాశముంది.



సాధన చేస్తున్న విద్యార్థులు

ఈ ఏడాది జిల్లాల వారీగా పరీక్ష రాసే విద్యార్థులు

జిల్లా	అభ్యర్థులు
ఆదిలాబాద్	564
మంచిర్యాల	1059
నిర్మల్	926
కుమురంభీం	482

● జిల్లా ● అభ్యర్థులు

ఉన్నత చదువులు చదువుతూ..

-రాంటెంకి విష్ణువర్ధన్



జన్నారం మండలం కిష్టాపూర్ ఉన్నత పాఠశాలలో చదివిన రాంటెంకి విష్ణువర్ధన్ ఎనిమిదో తరగతి పూర్తికాగానే జాతీయ ఉపకార వేతనానికి ఎంపికయ్యారు. ఉపకార వేతనం పొందుతూ ఇక్కడే పదో తరగతి పూర్తి చేశారు. ఆ తర్వాత హైదరాబాద్‌లోని సెంట్రల్ ఆఫ్ ఎక్స్‌లెన్సీలో ఇంటర్మీడియట్ చేస్తున్నారు. తన చదువులకు ఉపకార వేతనం ఎంతో తోడ్పడిందని ఆయన చెబుతున్నారు. ఇదే పాఠశాల నుంచి గతేడాది పది మంది విద్యార్థులు ఎంపికకాగా ఇప్పటి వరకు 240 మంది ఎంపిక కావడం గమనార్హం..

ప్రణాళికాబద్ధంగా సాధన

- ముత్తె వెంకటమల్లు, ఉపాధ్యాయుడు, వెల్గనూర్



ఉపకార వేతనం మధ్యతరగతి, పేద కుటుంబాల విద్యార్థులకు ప్రయోజనం. విద్యార్థులు ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా చదివితే విజయం వరిస్తుంది. మంచి భవిష్యత్తు ఉంటుంది. గణితం, సామాన్య శాస్త్రం, సాంఘిక శాస్త్రంలోని వివిధ పాఠాలపై పూర్తి అవగాహన పెంచుకోవాలి. మానసిక సామర్థ్యానికి సంబంధించిన అంశాలను రోజూ సాధన చేయాలి. గత పరీక్షల పేపర్లలో వచ్చిన ప్రశ్నలకు అనుగుణంగా సాధన చేయాలి.



● గతేడాది జాతీయ ఉపకార వేతనానికి ఎంపికైన జన్నారం మండలం కలమడుగు విద్యార్థులతో ఉపాధ్యాయులు. పది మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ప్రతి రోజూ పరీక్ష రాయబోయే విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రధానోపాధ్యాయుడు కట్ట రాజమౌళి, ఉపాధ్యాయులు కలిసి ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నారు.

ప్రాణం తీసిన కరెంట్



సతీష్

కోటపల్లి, న్యూస్‌టుడే: వ్యవసాయంలో తల్లిదండ్రులకు చేదోడు వాదోడుగా ఉంటున్నాడు. సాగు పనుల్లో తండ్రితో పాటు బాధ్యతను పంచుకున్నాడు. ప్రమాదవశాత్తు జరిగిన విద్యుదాఘాతంతో యువరైతు విగత జీవిగా మారాడు. ఈ ఘటన ఆ కుటుంబంలో తీరని శోకాన్ని నింపింది. వివరాల్లోకి వెళ్తే.. కోటపల్లి మండలం రాపన్‌పల్లి గ్రామానికి చెందిన భూర్తి సతీష్ (25) యువరైతు మంగళవారం పత్తి చేనుకు నీటి తడులను అందించేందుకు వెళ్లాడు. మోటారుకు విద్యుత్తు సరఫరా చేసే తీగ చెడిపోయి నీటిని బయటికి వదిలే ఇనుప పైపును తాకి ఉంది. ఇది గమనించని సతీష్ మోటారును స్టార్ట్ చేసి సంబంధిత పైపును పట్టుకోవడంతో విద్యుత్తు షాక్‌కు గురై అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. రాజబాపు - పద్మ దంపతులకు ఇద్దరు కొడుకులు ఉండగా మృతుడు సతీష్ మొదటి సంతానం. తమకున్న కొద్ది పాటు భూమితో పాటు మరో రెండు ఎకరాలు కౌలుకు తీసుకొని జీవనోపాధి పొందుతున్న కుటుంబంలో కుమారుడు మృత్యువాత పడటంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ఎస్సై రాజేందర్ సంఘటన స్థలాన్ని సందర్శించి వివరాలు నమోదు చేసుకున్నారు.

27న మందకృష్ణ మాదిగ రాక

జన్నారం, న్యూస్‌టుడే: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఈ నెల 27న జన్నారం వస్తున్నట్లు మాదిగ సంఘం జిల్లా అధ్యక్షుడు సమ్మయ్య, మండల అధ్యక్షుడు కొండుకూరి ప్రభుదాస్ తెలిపారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఉమ్మడి జిల్లా ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశానికి మందకృష్ణ మాదిగ ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లుగా వారు పేర్కొన్నారు. నాయకులు మామిడిపెల్లి ఇంధయ్య, కృష్ణ, రమేశ్, రవి, రాజేశ్, ఎల్లయ్య, రాహుల్, అంజన్న, వెంకటేశ్, ప్రశాంత్, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

మంచిర్యాల: 98663 07290
చెన్నూరు: 98496 20143
బెల్లంపల్లి: 99496 20369

మంచిర్యాల పట్టణం, న్యూస్‌టుడే:

? ఆండాళమ్మకాలనీలో కుటుంబ నియంత్రణ చేసిన కుక్కలను పాతమంచిర్యాలలో వదిలేస్తున్నారు. దీంతో పిల్లలు బడికి వెళ్లడానికి భయపడుతున్నారు. - **శ్రీనివాస్, పాతమంచిర్యాల**

✔ పాతమంచిర్యాలలో వదిలినట్లు తెలిస్తే వైద్య సిబ్బందితో మాట్లాడి ఎక్కడి నుంచి తెచ్చిన కుక్కలను అక్కడే వదిలేసేలా చర్యలు తీసుకుంటాం. - **ఉదయ్ కిరణ్, మున్సిపల్ పారిశుద్ధ్య విభాగం అధికారి, మంచిర్యాల**

కోటపల్లి, న్యూస్‌టుడే:

? కోటపల్లి మండలం నాగంపేట్, బొప్పారం మార్గమధ్యలో ఉన్న రహదారి ఇటీవల కురిసిన వర్షాలకు కోతకుగురై ప్రమాదకరంగా మారింది. - **మంత్రి రామయ్య, భాజపా మండల అధ్యక్షుడు**

✔ సంబంధిత రహదారి అటవీమార్గం ఉండటంతో ఆ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం. - **భరత్, ఆర్‌అండ్‌బీ జేఈ**

స్పందనకు వందనం: స్పందించి.. మరమ్మతులు చేపట్టి



బైపాస్‌రోడ్డులో మరమ్మతులు చేపడుతున్న సిబ్బంది

ఏసీసీ, న్యూస్‌టుడే: మంచిర్యాల పట్టణంలోని మేదరివాడ బైపాస్‌రోడ్డు నుంచి లక్ష్మీటాకీస్ చౌరస్తా వరకు డివైడర్ మధ్య ఏర్పాటు చేసిన స్తంభాలకు వీధి దీపాలు వెలగడం లేదు. సమస్యపై ఈ నెల 21న 'మేమున్నాం- మీకు తోడుగా'లో ప్రచురితమైంది. దీనిపై పట్టణ పురపాలిక సంబంధిత అధికారులు స్పందించారు. మంగళవారం ఆయా ప్రాంతాల్లో వెలగని దీపాలకు సిబ్బందితో మరమ్మతులు చేయించారు.

తిండి లేక స్పృహ తప్పిన యాచకుడు

మల్యాల, న్యూస్‌టుడే: కొండగట్టు ప్రాంతంలో బిచ్చమెత్తుకుంటే డబ్బులు బాగా దొరుకుతాయని చెప్పి ఓ వ్యక్తి 80 ఏళ్ల వృద్ధుడిని తీసుకొచ్చి వదిలేసి వెళ్లగా తిండి లేక అతడు స్పృహ కోల్పోయిన ఘటన ఇది. పోలీసుల కథనం ప్రకారం.. మంచిర్యాల జిల్లా ఇందారం గ్రామానికి చెందిన వృద్ధుడు మారినేని పోచయ్య, అదే జిల్లాకు చెందిన తిరుపతి వారి ప్రాంతాల్లో యాచించేవారు. కొండగట్టులో యాచిస్తే భక్తుల నుంచి ఎక్కువ డబ్బులు వస్తాయని వృద్ధుడికి తిరుపతి చెప్పాడు. సోమవారం సాయంత్రం కొండగట్టు దిగువ ప్రాంతంలోని మెహర్‌బాబా కేంద్రం సమీపంలోని జగిత్యాల - కరీంనగర్ జాతీయ రహదారి పక్కన వదిలేసి వెళ్లాడు. తిండిలేక వృద్ధుడు మంగళవారం స్పృహతప్పి పడిపోయాడు. మల్యాల బ్లూకోల్ట్స్ పోలీసులు అతడిని చికిత్స కోసం 108లో జగిత్యాల ఆసుపత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో వ్యక్తికి తీవ్ర గాయాలు

హాజీపూర్: ముల్కల్లలో మంగళవారం రాత్రి విద్యుదాఘాతంతో గోలివాడ చంద్రయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. ముల్కల్లకు చెందిన చంద్రయ్య గోదావరిలో చేపలు పట్టేందుకు మంచిర్యాల పంపుహౌజ్ వైపునకు వెళ్తున్న క్రమంలో విద్యుత్తు తీగ తెగిపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

గంజాయి విక్రేతల పట్టివేత

నస్పూర్: నిషేధిత గంజాయిని విక్రయిస్తున్న నిందితులను శ్రీరాంపూర్ పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై సంతోష్ తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీరాంపూర్‌కు చెందిన యువకులు దెబ్బటి నవదీప్, వడ్డెపల్లి యశ్వంత్‌లు జల్సాలకు అలవాటు పడి గంజాయి విక్రయిస్తున్నారు. మంగళవారం ఆర్కే-6 ఏరియాలో విక్రయించడానికి యత్నిస్తున్నారు. నిందితులను పట్టుకొని వారి నుంచి 210 గ్రాముల గంజాయి, ద్విచక్ర వాహనం, రెండు చరవాణులు స్వాధీనం చేసుకున్నామని ఎస్సై తెలిపారు. అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

రామకృష్ణాపూర్: మందమర్రి పట్టణంలో గంజాయి రవాణా, విక్రయిస్తున్న ముగ్గురిని అరెస్టు చేశారు. సీఐ శశిధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం ఉదయం పట్టణ అదనపు ఎస్సై ఎన్.శ్రీనివాస్ సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహిస్తున్నారు. మందమర్రి బూరుదగూడెంకి చెందిన మక్కల గంగాధర్, బండారి వరుణ్, బండారి మధుసూదన్‌ల వద్ద 400 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నేరాల నియంత్రణకే నిర్బంధ తనిఖీలు

తాండూరు: నేరాల నియంత్రణకే నిర్బంధ తనిఖీలు నిర్వహిస్తున్నామని సీఐ కుమారస్వామి అన్నారు. మంగళవారం ఆసన్‌మాడ గ్రామంలో నిర్బంధ తనిఖీలు నిర్వహించారు. సరైన ప్రతాలు, సంఖ్య పలకలు లేని వాహనాలకు జరిమానాలు విధించారు. మాదారం ఎస్సై సౌజన్య, కన్నెపల్లి, భీమిని ఎస్సైలు గంగారాం, విజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

జూద స్థావరం పై దాడి

కన్నెపల్లి, న్యూస్‌టుడే: భీమిని మండలం వీగాం గ్రామ శివారులో రహస్యంగా జూదం ఆడుతున్న స్థావరంపై కన్నెపల్లి పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. వీగాం గ్రామానికి చెందిన గాండ్ల మల్లేష్, రామకృష్ణ, గుజ్జ గుండయ్య, శంకర్, సాయిల్లా భీమేష్, నస్పూరి రమేష్, నన్నా వెంకటేశం, రాజేష్, రాకేష్‌లను పట్టుకున్నట్లు ఎస్సై గంగారాం తెలిపారు.

బీసీ జాగృతి సేన అధికార ప్రతినిధిగా శ్రీధర్

జన్నారం: జిల్లా బీసీ జాగృతి సేన అధికార ప్రతినిధిగా తాను ఎన్నికైనట్లు జన్నారానికి చెందిన దండవేణి శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు.

అధ్యాపకుడికి సన్మానం

చెన్నూరు గ్రామీణం: మండలంలోని కిష్టంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒప్పంద అధ్యాపకుడు(జంతుశాస్త్ర విభాగం) దారిశెట్టి కృష్ణగోపాల్ ఉత్తరప్రదేశ్‌లోని సహరాన్‌పూర్ గ్లోకల్ విశ్వవిద్యాలయం నుంచి జంతుశాస్త్ర విభాగంలో పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. మంగళవారం కళాశాలలో కృష్ణగోపాల్‌ను ప్రిన్సిపల్ ఎంవీ పట్వార్ధన్, అధ్యాపకులు సన్మానించారు.

ఓటుహక్కు నమోదు పత్రాల అందజేత

చెన్నూరు గ్రామీణం: పీఆర్టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో మండలంలోని అస్నాద్, దుగ్నెపల్లి, పొక్కూరు, కొమ్మెర జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలల్లో మంగళవారం ఎమ్మెల్సీ ఓటుహక్కు నమోదు చేపట్టారు.

నస్పూర్: మంగళవారం తీగల్‌పహాడ్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు జిల్లా ప్రధాన కార్యదర్శి రాసపల్లి రవి ఓటరు నమోదు పత్రాలు అందజేశారు.

కూడలి రహదారిపైకి నాలా నీరు



కూడలి రహదారిపైకి వస్తున్న మురుగు నీరు

తాండూరు గ్రామ పంచాయతీ పరిధిలోని 1వ వార్డులో రహదారి కూడలిపైకి మురుగు నీరు ఏరులై పారుతోంది. నాలాను కాలనీ చివరి వరకు నిర్మించి ప్రధాన కాలువకు కలపకుండా అసంపూర్తిగా వదిలేశారు. దీంతో కాలనీ మురుగు నీరంతా నాలా నుంచి కూడలి రహదారిపైకి వచ్చి చేరుతుండటంతో కాలనీవాసులు నిత్యం ఇబ్బందులకు గురవుతున్నారు. - **తాండూరు, న్యూస్‌టుడే**

రైల్వే సమస్యలపై జీఎంకు వినతి

బెల్లంపల్లి పట్టణం: తాండూరు మండలం రేచిని రోడ్డు రైల్వే సమస్యలను పరిష్కరించాలని మంగళవారం ఎమ్మెల్యే గడ్డం వినోద్ హైదరాబాద్‌లో రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. రేచిని రైల్వేస్టేషన్‌లో ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పొడిగింపుతో పాటు రామగిరి రైలు హాల్టింగ్ సౌకర్యం, వసతులు కల్పించాలని వినతిపత్రం అందజేశారు. రేచిని రైల్వేస్టేషన్‌లో సర్వే నిర్వహించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జీఎం ఆదేశించినట్లు ఎమ్మెల్యే చెప్పారు.



వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే గడ్డం వినోద్, నాయకులు

ప్రతిభకు ప్రోత్సాహం.. విజేతలకు పురస్కారం



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న పాఠశాల నిర్వాహకులు

మంచిర్యాల విద్యావిభాగం, న్యూస్‌టుడే: విద్యార్థుల అంతర్గత సామర్థ్యాలను గుర్తించి ప్రోత్సహించేందుకు 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహిస్తోంది. మంగళవారం జిల్లా కేంద్రంలోని రివిలేషన్ హై స్కూల్‌లో అంతర్జాల వినియోగంపై లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం అంశంపై 8, 9, 10వ తరగతుల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రథమ స్థానంలో ఇ.సుదీష(9వ), ద్వితీయ స్థానంలో బి.శ్రీహర్షిణి(9వ), తృతీయ స్థానంలో ఎస్.గాయత్రి(10వ) నిలిచారు. వీరికి పాఠశాల కరస్పాండెంట్ రాపోలు విష్ణువర్ధన్‌రావు, ప్రిన్సిపల్ ఎం.ప్రశాంత్ బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఉపాధ్యాయురాలు అనూష తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కుస్తీ పోటీలకు ఎంపిక

లక్సెట్టిపేట, న్యూస్‌టుడే: పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకులానికి చెందిన డి.శాలిని, ఎం.స్పందన, సీహెచ్ సహస్రలు జాతీయ స్థాయి కుస్తీ పోటీల్లో పాల్గొననున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ రమాకల్యాణి తెలిపారు. నారాయణపేట జిల్లా ధన్వాడలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 19 సంవత్సరాల లోపు విభాగం కుస్తీ పోటీల్లో ఉమ్మడి జిల్లా తరపున ఆడి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు ఆమె వెల్లడించారు. ఉత్తర్ ప్రదేశ్‌లోని మీరట్‌లో ఈ నెల 23, 24, 25 తేదీల్లో జరిగే క్రీడా పోటీల్లో పాల్గొంటారని ఆమె వివరించారు.



ఎంపికైన క్రీడాకారులతో ప్రిన్సిపల్ రమాకల్యాణి

రాష్ట్ర స్థాయి కరాటే..

రామకృష్ణాపూర్: మందమర్రి పట్టణంలోని ఆదర్శ పాఠశాలకు చెందిన సీహెచ్ సనిత్ రాష్ట్ర స్థాయి కరాటే పోటీలకు ఎంపిక అయినట్లు మంగళవారం పాఠశాల ప్రిన్సిపల్ సారా తస్లీమ్ తెలిపారు. ఇటీవల నస్పూర్‌లో స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఇఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన 68వ జోనల్ లెవెల్ కరాటే ఎంపిక పోటీల్లో అండర్-17 బాలుర 62 కిలోల విభాగంలో పాల్గొని ప్రతిభ చాటినట్లు తెలిపారు.



సనిత్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపల్ సారా తస్లీమ్

ఆయుధం చూపించి.. అవగాహన కల్పించి

నెన్నెల, న్యూస్‌టుడే: నెన్నెల పోలీస్ స్టేషన్‌లో అమరవీరుల దినోత్సవంలో భాగంగా విద్యార్థులకు పోలీస్ చట్టాలపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్టేషన్‌లో ఉన్న రికార్డులను చూపించి వాటి ఉపయోగం వివరించారు. పోలీసులు వినియోగిస్తున్న ఆయుధాలపై అవగాహన కల్పించారు. ఎస్సై ప్రసాద్, సిబ్బంది, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ఆయుధాలు చూపిస్తున్న ఎస్సై ప్రసాద్

గ్రామీణ రహదారులకు మహర్దశ

లక్సెట్టిపేట, న్యూస్‌టుడే : మంచిర్యాల నియోజక వర్గం లోని గ్రామీణ రహదారులకు మహర్దశ పట్టనుంది. పంచాయతీ రాజ్ శాఖ సీఆర్ఆర్ నిధులు రూ. 15 కోట్లతో నియోజక వర్గంలోని హాజీపూర్, లక్సెట్టిపేట, దండేపల్లి మండలాల్లో 7.33 కిలోమీటర్ల మేర రహదారులు, వంతెనలను నిర్మించనున్నారు. దీని కోసం ప్రభుత్వం తాజాగా నిధులు మంజూరు చేసింది.



లక్సెట్టిపేట మండలం కొత్తూరు నుంచి చందారం వెళ్లే దారి

తీరనున్న ఇబ్బందులు

నియోజక వర్గంలోని ఆయా మండలాల్లోని గ్రామాల్లో చేపట్టనున్న వంతెనలు, రహదారుల నిర్మాణం పూర్తి అయితే ఆయా గ్రామాలకు రాకపోకలకు ఇబ్బందులు తీరనున్నాయి. వర్షాకాలంలో వాగు వంకలు పొంగిన సమయంలో వంతెనలు లేక రాకపోకలు ఇబ్బందులు తలెత్తేవి. మరో వైపు రహదారుల నిర్మాణంతో మండల కేంద్రాలు, జాతీయ, రాష్ట్రీయ రహదారులను చేరుకోవడం సులువు కానుంది.

సమ సమాజ స్థాపనకు కృషి

ఏసీసీ, న్యూస్‌టుడే: సమ సమాజ స్థాపనే లక్ష్యంగా విప్లవ విద్యార్థి సంఘం పీడీఎస్‌యూ ఏర్పడిందని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.శ్రీకాంత్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని మైనార్టీ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన సభలో మాట్లాడారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి సంఘం ఆధ్వర్యంలో ఎంతగానో కృషిచేస్తున్నట్లు తెలిపారు. విద్యారంగానికి ప్రభుత్వాలు సరైన బడ్జెట్ కేటాయించి మెరుగైన విద్యకు కృషి చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలు, ఉపకార వేతనాలు వెంటనే విడుదల చేయాలన్నారు. గురువారం హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభ నిర్వహిస్తుమన్నారు. పీడీఎస్‌యూ పూర్వ విద్యార్థులు డా. ఆర్.ప్రకాశం, అజ్మీరా లాల్‌కుమార్, అందె మంగ, తాళ్లపల్లి శ్రీనివాస్, సమ్మయ్య పీడీఎస్‌యూ నాయకులు కార్తిక్, విజయ్, అంజి, రాజ్‌కుమార్, తిరుపతి, విద్యార్థులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.శ్రీకాంత్

మొక్కల సంరక్షణపై బీట్ అధికారులకు శిక్షణ

భీమారం: మండల కేంద్రంలోని కేంద్రీయ నర్సరీ, ప్లాంటేషన్, గొల్లవాగు జలాశయం సమీపంలోని అటవీ ప్రాంతాలలో హైదరాబాద్‌లోని దూలపల్లి శిక్షణ కేంద్రం నుంచి వచ్చిన శిక్షణ బీట్ అధికారులు మంగళవారం పర్యటించారు. వారికి డీఎఫ్‌వో వినయ్‌కుమార్ సాహో నర్సరీ, ప్లాంటేషన్‌లో మొక్కల సంరక్షణపై శిక్షణనిచ్చారు. ఎఫ్ఆర్వో రత్నాకర్‌రావు, డీఆర్‌వో సుధాకర్, ఎఫ్ఎస్‌వో రామకృష్ణ సర్కార్, బానేష్ పాల్గొన్నారు.

ప్రజలు ఓడించినా పరివర్తన రావడం లేదు

★ మాజీ ఎమ్మెల్యే దివాకర్‌పై కాంగ్రెస్ నేతలు ధ్వజం



సమావేశంలో మాట్లాడుతున్న పుర చైర్మన్ ఉప్పలయ్య, కాంగ్రెస్ నేతలు

మంచిర్యాలఅర్బన్, న్యూస్‌టుడే: ఓ వైపు ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తుంటే మరోవైపు మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు విమర్శలు చేయడమే పనిగా పెట్టుకున్నారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. మంగళవారం ఎమ్మెల్యే నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ గత ఎన్నికల్లో దివాకర్‌రావును ప్రజలు ఓడించినా ఆయన పరివర్తన రావడం లేదన్నారు. ఎన్ని కుయుక్తులు చేసినా నడిపెల్లి విజిత్ ఎమ్మెల్యేగా గెలవడని, భారాస టికెట్టు రాదని ఆరోపించారు. ఆసుపత్రి నిర్మాణం జరుగుతున్నందున మంచి మంచిర్యాల అక్షరాలు తామే తొలగించి మున్సిపల్ కార్యాలయం ఆవరణలో భద్రపరిచామన్నారు. సమాచార లోపంతో మున్సిపల్ కమిషనర్‌కు విషయం తెలియలేదని, ఈ అంశాన్ని రాద్ధాంతం చేయాల్సిన అవసరం లేదన్నారు. మంచిర్యాల, నస్పూర్ మున్సిపల్ ఛైర్మన్లు రావుల ఉప్పలయ్య, వేణు, వైస్‌ఛైర్మన్ సల్ల మహేష్, పీసీసీ ప్రధానకార్యదర్శి చిట్ల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అసత్య ఆరోపణలు మానుకోవాలి

హాజీపూర్: ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావుపై అసత్య ఆరోపణలు మానుకోవాలని కాంగ్రెస్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి డిమాండ్ చేశారు. హాజీపూర్ మండలకేంద్రంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. అభివృద్ధిని ఓర్వలేక భారాస నాయకులు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

దండేపల్లి: నియోజకవర్గంలో అభివృద్ధిని చూసి ఓర్వలేక ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావుపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఆర్‌జీపీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, కాంగ్రెస్ జిల్లా నాయకుడు గడ్డం త్రిమూర్తి పేర్కొన్నారు. మంగళవారం ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అక్కల వెంకటేశ్వర్లు, గడ్డం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి ఓర్వలేక ఆరోపణలు

జన్నారం: రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు చూసి ఓర్వ లేకనే కొంతమంది ప్రభుత్వం మీద, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్‌పై ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముజాఫర్‌అలీఖాన్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

పశ్చిమ బెంగాల్, కేంద్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మ దహనం

మంచిర్యాల పట్టణం, న్యూస్‌టుడే: కోల్‌కత్తాలో జూనియర్ వైద్యులు చేస్తున్న పెన్‌డౌన్ నిరసనకు మద్దతుగా పీఓడబ్ల్యూ, ఐఎఫ్‌టీయూ నాయకులు మంగళవారం మంచిర్యాలలో పశ్చిమ బెంగాల్, కేంద్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మంగ మాట్లాడుతూ కోల్‌కత్తా ఆర్జికార్ ఆసుపత్రిలో మహిళా ట్రైనీ డాక్టర్‌పై జరిగిన అత్యాచార, హత్య సంఘటనపై సుప్రీం కోర్టు న్యాయమూర్తితో విచారణ చేయించి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నాయకులు అరుణ, మంగ, లక్ష్మి, సుశీల, తాళ్లపల్లి శ్రీనివాస్: మల్లన్న, మేకల రామన్న, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలు వెంటనే ప్రకటించాలి

చెన్నూరు గ్రామీణం, న్యూస్‌టుడే: గత రెండేళ్ల నుంచి ఉపాధ్యాయులకు రావాల్సిన అయిదు డీఏలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని, 50శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీని ప్రకటించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) జిల్లా అధ్యక్షుడు సయింపుల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. చెన్నూరు మండలంలోని పొక్కూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఉపాధ్యాయులతో కలిసి నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం అర్హులైన ఉపాధ్యాయులతో ఓటరుగా నమోదు చేయించారు. జిల్లా ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి సాంబయ్య, కొట్టె నాగరాజు, కార్యదర్శి తోడె తిరుపతి, నాయకులు భిక్షపతి, సభ్యులు పాల్గొన్నారు.

24న జాబ్‌మేళా

మంచిర్యాల సిటీ, న్యూస్‌టుడే: జిల్లా ఉపాధి, శిక్షణ శాఖ ఈ నెల 24న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఆయా శాఖ జిల్లా అధికారి ముప్పిడి రజిని కిరణ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఐటీఐ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఏదైనా డిగ్రీ, 18-30ఏళ్ల వయసు ఉన్నవారు అర్హులని చెప్పారు.

నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన

తాండూరు: పెండింగ్‌లో ఉన్న అయిదు డీఏలతో పాటు పీఆర్సీ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(టీపీయూఎస్) ఆధ్వర్యంలో మంగళవారం తాండూరులో నిరసన వ్యక్తం చేశారు. నల్లబ్యాడ్జీలు ధరించి మధ్యాహ్న భోజన సమయంలో ఆందోళన చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే తమ డిమాండ్లను పరిష్కరించాలన్నారు. టీపీయూఎస్ జిల్లా ఉపాధ్యక్షులు భారతి, అశోక్, రమేష్ పాల్గొన్నారు.

గ్రామ దేవతలకు జలాభిషేకం

నెన్నెల: నందులపల్లి గ్రామంలో మంగళవారం వర్షాలు కురవాలని మహిళలు గ్రామ దేవతలకు 108 బిందెలతో జలాభిషేకం చేశారు.

పంచాయతీ రికార్డుల పరిశీలన

నెన్నెల, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని పారిశుద్ధ్య కార్యక్రమాలను జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు మంగళవారం పరిశీలించారు. గ్రామంలో వార్డులు పరిశుభ్రంగా ఉండాలని కార్యదర్శికి సూచించారు. పంచాయతీ రికార్డులను పరిశీలించారు. కస్తూర్బా విద్యాలయంలో తనిఖీ చేశారు.

కుమురంభీంకు ఘన నివాళి

భీమారం, న్యూస్‌టుడే: బురుగుపల్లి గ్రామంలో కుమురం భీం జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ఆదివాసీ, నాయక్‌పోడు, లంబాడాలు ఐక్యంగా కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. భీం చిత్రపటానికి నివాళులర్పించారు. దరావత్ శంకర్, పోర్ధిక మారయ్య, పేదం బాపు, అశోక్, మల్లేష్, విఘ్నేష్, రవితేజ, తదితరులు పాల్గొన్నారు.

నర్సరీల పనులు వేగవంతం చేయాలి

చెన్నూరు గ్రామీణం: మండలంలోని సంకారం, సోమన్‌పల్లి, అస్నాద్, పోన్నారం గ్రామాల్లో నర్సరీ పనులను మంగళవారం జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్ పర్యటించారు. ఎర్రమట్టి, నల్లమట్టి, సేంద్రియ ఎరువులతో సంచులను నింపి డిమాండ్‌కు అనుగుణంగా విత్తనాలు నాటాలని ఉపాధిహామీ సిబ్బందిని ఆదేశించారు. పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఎంపీడీవో మోహన్, ఏపీవో గంగాభవాని, శ్రీనివాస్, హరిత, శేఖర్ పాల్గొన్నారు.



సంకారంలో సంచులు నింపుతున్న తీరును పరిశీలిస్తున్న డీఆర్డీవో కిషన్

పాఠశాల భవన నిర్మాణ పనుల పరిశీలన

కన్నెపల్లి, న్యూస్‌టుడే: కన్నెపల్లి మండలంలోని చర్లపల్లి పాఠశాలలో నిర్మిస్తున్న భవన నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మంగళవారం పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి చేయాలని గుత్తేదారుకు సూచించారు.

నకిలీ ఎరువులు విక్రయించొద్దు

భీమిని, న్యూస్‌టుడే: నకిలీ ఎరువులు, పురుగు మందులు రైతులకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని ఏడీఏ సురేఖ అన్నారు. మంగళవారం భీమిని, మల్లీడి, వెంకటాపూర్ ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. స్టాక్ రిజిష్టర్లు, బిల్లులను పరిశీలించారు. ఏఈఓలు కార్తిక్, వినోద్ ఉన్నారు.

రోడ్లపై వ్యాపారాలు చేస్తే జరిమానాలు

బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే: రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు చేస్తే జరిమానాలు తప్పవని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. కొత్తబస్టాండ్ నుంచి కాంటాచౌరస్తా వరకు వ్యాపారులు తమ తమ హద్దుల్లోనే వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు. రోడ్ల మీదకు వచ్చిన దుకాణ సముదాయాలను స్వచ్ఛందంగా తొలగించుకోవాలని, లేకపోతే తొలగించక తప్పదని పేర్కొన్నారు.



జైపూర్‌లో మాట్లాడుతున్న హెచ్‌ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్

సమస్యలపై స్పందించకుంటే సమ్మె తప్పదు

★ హెచ్‌ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్

జైపూర్, న్యూస్‌టుడే : సింగరేణి థర్మల్ విద్యుత్తు కేంద్రం ఒప్పంద ఉద్యోగుల సమస్యలపై యాజమాన్యం త్వరగా స్పందించకుంటే సమ్మె తప్పదని హెచ్‌ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ అన్నారు. మంగళవారం జైపూర్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని మిగతా విద్యుత్తు ఉత్పత్తి సంస్థల్లో నిర్వాసితులకు శాశ్వత ఉద్యోగాలు, ఒప్పంద కార్మికులకు అలవెన్స్‌లను అందిస్తుంటే ఎస్టీపీపీలో వాటి జాడే లేదన్నారు. సింగరేణిలో రాజకీయ జోక్యం పెరగడం వల్ల సంస్థ నష్టాలపాలు అవుతుందన్నారు. తమ హక్కుల కోసం కార్మికులు సైతం సమ్మె చేయడానికి తమ అంగీకారాన్ని తెలిపారు. నాయకులు విక్రమ్, సంపత్, సాయికృష్ణారెడ్డి, సందీప్, సంతోష్, తదితరులు ఉన్నారు.

పారదర్శకంగా సర్ఫేస్ జనరల్ మజ్దూర్ ఉద్యోగాలు

శ్రీరాంపూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: శ్రీరాంపూర్ ఏరియాలో సర్ఫేస్ జనరల్ మజ్దూర్ ఉద్యోగాలు పైరవీలు, అవినీతికి తావులేకుండా సీనియార్టీ ప్రకారం అర్హులైన వారికి ఇప్పించామని గుర్తింపు సంఘం ఉపప్రధాన కార్యదర్శులు కె.వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య పేర్కొన్నారు. మంగళవారం శ్రీరాంపూర్ ఉపరితల గని వద్ద మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేసేందుకు చిత్తశుద్ధితో పని చేస్తున్నామన్నారు. రాష్ట్రంలోని బొగ్గు గనులు సింగరేణికి కేటాయించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎం.కొమురయ్య, చంద్రమోహన్, బుచ్చయ్య, పిట్ కార్యదర్శి మోతె లచ్చయ్య, అఫ్రోజ్‌ఖాన్, సత్తయ్య పాల్గొన్నారు.

23 నుంచి ట్రేడ్ యూనియన్‌ల ప్రతినిధులకు అవగాహన

రామకృష్ణాపూర్, న్యూస్‌టుడే: సింగరేణి ఆధ్వర్యంలో ఈ నెల 23 నుంచి 26 వరకు హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలజీ ఆఫ్ ఇండియా(ఈఎస్‌సీఐ)లో నిర్వహించనున్న రెసిడెన్షియల్ ఇన్‌హౌజ్ శిక్షణ కార్యక్రమానికి మందమర్రి ఏరియా నుంచి ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, ఐఎన్‌టీయూసీ కేంద్ర ఉపాధ్యక్షుడు కాంపల్లి సమ్మయ్య ఎంపిక య్యారు. సింగరేణి వ్యాప్తంగా 14 మంది ట్రేడ్ యూనియన్‌ల ప్రతినిధులు పాల్గొననున్నారు. వీరికి పలు విషయాలపై అవగాహన కల్పించనున్నారు.

సింగరేణి సమాచారం

ఫోర్‌మెన్‌లకు వెబ్ కౌన్సెలింగ్

శ్రీరాంపూర్ గ్రామీణం: బదిలీపై ఇతర ఏరియాలకు వెళ్లేందుకు ఛార్జ్ హ్యాండ్ ఎలక్ట్రికల్ ఫోర్‌మెన్‌లకు వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించారు. మంగళవారం ఏరియాలోని గనుల వృత్తి శిక్షణ కేంద్రంలో శ్రీరాంపూర్, మందమర్రి ఏరియాలకు చెందిన 23 మంది ఉద్యోగులు పాల్గొన్నారు. వీరిలో 10 మంది ఉద్యోగాలు ఎంపిక చేసుకున్నారు. డీజీఎం(పీ) అరవిందరావు, డీజీఎం(ఐఈడీ) చిరంజీవులు, అమర్‌నాథ్‌రెడ్డి, రాజేశ్వర్‌రావు, కె.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

'సింగరేణి స్థలాలను రక్షించాలి'

రామకృష్ణాపూర్: రామకృష్ణాపూర్ పట్టణంలోని సింగరేణి భూములను కాపాడేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఎస్.వెంకటస్వామి మంగళవారం డిమాండ్ చేశారు. పట్టణంలోని స్థానిక జయశంకర్ విగ్రహం వద్ద గల సింగరేణి ఖాళీ స్థలం కబ్జా చేసేందుకు పట్టణంలోని అధికార పార్టీకి చెందిన 22వ వార్డు కౌన్సిలర్ భర్త కుట్ర చేస్తున్నట్లు ఆరోపించారు. ఈ స్థలాన్ని ఇటీవల చదును చేయించారని, దీంతో అక్కడ ఉన్న సెప్టిక్ ట్యాంకు సైతం ధ్వంసమైందన్నారు. ఐలయ్య, శ్రీధర్ ఉన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి పుర పరిధిలోని స్థానిక 10వ వార్డు కుర్మపల్లి స్టేజీ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందడంతో పురపాలిక ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించారు. మంగళవారం ఉదయం కుర్మపల్లి స్టేజీ వద్ద వ్యక్తి మృతదేహాన్ని గమనించిన వార్డు కౌన్సిలర్ పనాస రాజు పుర అధికారులకు సమాచారం అందించారు. దీంతో వారు అంత్యక్రియలు నిర్వహించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్, శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

అభయ అత్యాచార నిందితులను శిక్షించాలి

బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే: అభయ అత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలని ఇఫ్టూ ఆధ్వర్యంలో పట్టణంలోని కాంటాచౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు. సీబీఐ సంస్థ నిందితులను గుర్తించడంలో జాప్యం చేస్తుందని జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి శ్రీనివాస్ ఆరోపించారు. కాంటాచౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. వెంకటి, కృష్ణవేణి, సునీత, దేవమ్మ పాల్గొన్నారు.

యువ ఉద్యోగులు సంస్థ అభివృద్ధిలో భాగస్వాములు కండి

శ్రీరాంపూర్ గ్రామీణం: సంస్థలోకి కొత్తగా వస్తున్న ఉద్యోగులు వృత్తి నైపుణ్యాలపై దృష్టి సారించాలని శ్రీరాంపూర్ జీఎం బి.సంజీవరెడ్డి సూచించారు. మంగళవారం జీఎం కార్యాలయంలో కారుణ్య నియామకాలు పొందిన వారసులకు ధ్రువ పత్రాలు అందజేశారు. యువ ఉద్యోగులు తేలిక పాటి పనుల కోసం పైరవీలు చేయకుండా సంస్థ అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. ఎస్ఓటు జీఎం ఎన్.సత్యనారాయణ, గుర్తింపు సంఘం ఏరియా కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా, కె.వెంకటేశ్వర్‌రెడ్డి, అరవిందరావు, పి.కాంతారావు పాల్గొన్నారు.



కారుణ్య నియామక పత్రాలు పొందిన వారసులతో జీఎం బి.సంజీవరెడ్డి